సాక్షి
కర్నూలు
బుధవారం ౹ 21 ౹ ఫిబ్రవరి ౹ 2024



## మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యకళా వేదికపై మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఆశా నాయుడు బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



## కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు మంగళవారం 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు.



## ట్రిపుల్ ఐటీ డీఎం జాతికి అంకితం

కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టుపై ఉన్న ట్రిపుల్‌ఐటీ డీఎంను ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం జమ్మూకశ్మీర్ నుంచి వర్చ్‌వల్‌గా జాతికి అంకితం చేశారు.

## న్యూస్‌రీల్

### నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం


కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సమావేశ భవనంలో జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా–పారిశుద్ధ్యం, జిల్లా గ్రామీణాభివృద్ధి, జెడ్పీ, మండల పరిషత్‌లకు సంబంధించిన 2024–25 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్, 2003–24 ఆర్థిక సంవత్సరానికి సంబధించిన సవరణ బడ్జెట్‌పై సమీక్షిస్తామన్నారు. చైర్మన్ అనుమతితో ఇతర అంశాలపైనా చర్చ కొనసాగుతుందన్నారు. సమావేశానికి హాజరుకావాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీపీలకు సమాచారం అందించామన్నారు.

### క్వింటా వాము రూ.27,575

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాముతో పాటు కందులు, వేరుశనగ, మొక్కజొన్న పంటలకు ధర ఆశాజనకంగా లభిస్తోంది. మంగళవారం మార్కెట్‌కు వాము దాదాపు 1,356 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.1,356, గరిష్ట ధర రూ.27,575, సగటు ధర రూ.18,899 పలికింది. కందులు మార్కెట్‌కు 732 క్వింటాళ్లు రాగా..కనిష్ట ధరరూ.809, గరిష్ట ధర రూ.9,968, సగటు ధర రూ.9,849 లభించింది. మినుములు 177 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.8,501, గరిష్ట ధర రూ.9,239, సగటు ధర రూ.9,169 నమోదైంది. ఎండుమిర్చి మార్కెట్‌కు 925 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.1,099, గరిష్ట ధర రూ.18,189, సగటు ధర రూ.12,911 ప్రకారం ధర లభించింది.

### ఓటరు జాబితాపైనా తప్పుడు కథనాలు

- దిగజారుతున్న ఈనాడు రాతలు



ఓటరు జాబితా 127లో ఉన్న ఓటరు ముల్లా హసీన

ఆలూరు రూరల్: ఓటరు జాబితాపై ఈనాడు తప్పుడు కథనాలు రాసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఓటరు జాబితా సవరణ చేపట్టి బీఎల్ఓల ద్వారా ఇంటింటికి వెళ్లి మార్పులు, చేర్పులు, తొలిగింపుల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తూ ఉంటే.. మరో పక్క జాబితాలో తప్పులు దొర్లాయంటూ ఎల్లో మీడియా అసత్య కథనాలు ప్రచురిస్తోంది. ఇందులో భాగానే ఆలూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రం 127లోని వరుస సంఖ్య 103లో ఉన్న ఓటరు ముల్లా హసీనా (నంబర్ ఐడీ డబ్ల్యూవైసీ1592435)కు వివాహమై ఇతర గ్రామంలో నివసిస్తోందని, అయినా ఓటరు జాబితాలో పేరు తొలిగించలేదని ఈనెల 18న ఈనాడులో తప్పుడు కథనం ప్రచురించారు. ఈ కథనంపై అధికారులు బీఎల్ఓతో విచారణ చేయించారు. వాస్తవానికి హసీనాకు వివాహం కాలేదని, ఆమె తల్లిదండ్రులతో సహా ఇంట్లో ఉంటోందని ఎన్నికల అధికారి 'సాక్షి'కి వివరణ ఇచ్చారు.

# అమ్మ చేతి గోరుముద్దలా..!

**చంద్రబాబు హయాంలో..**

ఉడికీ ఉడకని అన్నం.. పలుచని చారు.. సాంబారులో వెతికనా దొరకని కూరగాయలు గతంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్న మెనూ.

**జగనన్న పాలనలో..**

కోడిగుడ్డు కూర,పొంగల్, పలావ్, పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, వెజిటబుల్ బిర్యానీ, ఆలూకుర్మా, నిమ్మకాయ పులిహోరా, తీపి పొంగల్, ఆకుకూర పప్పు, పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనాతో చేసిన పప్పుతో పాటు వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు చిక్కీలు, రాగిజావ.

- పాఠశాలల్లో పక్కాగా విద్యార్థులకు పౌష్టికాహారం
- జిల్లాలో 2.67 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి



ప్రభుత్వ ఉన్నత(టౌన్ మోడల్)పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: పేద విద్యార్థులు ఆసక్తిగా చదువు కోవాలంటే వారికి ఆకలి తెలియకూడదు. ఆరోగ్యకరంగా ఉంటేనే ఆ పిల్లలు చదువుల పట్ల శ్రద్ధ చూ పుతారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసించారు. ఆ దిశగా జగనన్న గోరుముద్ద పేరు తో మధ్యాహ్న మెనూలో మార్పు చేయించి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తదితర పర్యవేక్షణ నిమిత్తం ఎంఈఓ–2లను సైతం నియమించారు. మన బడి నాడు–నేడు పనులు పూర్తయిన ప్రతి స్కూల్‌లో విద్యార్థులకు మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది మార్చి చివరి నుంచి రాగిజావాను అందిస్తున్నారు.

**పిల్లల్లో పెరిగిన పౌష్టికాహారం..!**

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యం, ఎయిడెడ్ యాజమాన్యంలో మొత్తం 1,436 పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో మొత్తం 2,67,828 మంది విద్యార్థులు, నంద్యాల జిల్లాలో 1,369 పాఠశాలలల్లో 1,43,470 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. ప్రతి రోజు ఒక్కో రకమైన ఆహార పదార్థాలు వేడివేడిగా తయారీ చేసి వడ్డించేందుకు 7,460 వంట ఏజెన్సీలు ఉన్నాయి. వంట ఏజెన్సీల బిల్లులు, ఏజెన్సీల నిర్వాహకులకు బిల్లులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. వంట ఏజెన్సీల నిర్వాహకులకు టీడీపీ ప్రభుత్వం హయాంలో కేవలం రూ.600 కేంద్రం ఇచ్చే వేతనాలు ఇచ్చే వారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చే ఆరు వందలకు అదనంగా మరో రెండు వేల నాలుగు వందల రూపాయలు అందిస్తుంది. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కుకింగ్ చార్జీలను సైతం పెంచారు. ప్రస్తుతం పెరిగిన చార్జీల ప్రకారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5.45, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8.57 చొప్పున చెల్లిస్తున్నారు.

**వారానికి 15 రకాల వంటలు**


జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రస్తుతం అమలు చేస్తున్న మెనూ ప్రకారం వారంలో 15 రకాలను విద్యార్థులకు అందజేస్తున్నారు. గతంలో కేవలం మూడు, నాలుగు రకాలు వంటలు కూడా అందించేవారు కాదు. వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, వారంలో మూడు రోజులు చిక్కీలు, రాగిజావ, కోడిగుడ్డు కూర, పొంగల్, పలావ్, పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, వెజిటబుల్ బిర్యానీ, ఆలూకుర్మా, నిమ్మకాయ పులిహోరా, ఆకుకూర పప్పు, పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, తీపి పొంగల్ వంటి రకాలను అందిస్తున్నారు.

**కొత్తగా వంట పాత్రలు**



ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసేందుకు టీడీపీ హయాంలో పాత్రలు ఉండేవి కాదు. గ్యాస్ సిలిండర్లు కూడా సక్రమంగా ఉండేవి కాదు. చాలా చోట్ల వంట చేసేందుకు ఏజెన్సీల నిర్వాహకులు పాత్రలు అద్దెకు తెచ్చి, కట్టెల పొయ్యిపై వంట చేస్తూ అనారోగ్యం భారీన పడిన సంఘటలను ఉన్నాయి. అయితే మహిళలు వంట చేసేందుకు ఎక్కడా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి స్కూల్‌లో వంట పాత్రలను విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు ఇటీవల పంపిణీ చేశారు. కట్టెల పొయ్యికి బదులుగా గ్యాస్ కనెక్షన్లను అందజేసి గ్యాస్ స్టవ్‌లపై వంట చేయిస్తున్నారు.

**గోరుముద్ద మెనూ**



- సోమవారం: వేడి పొంగల్, ఉడికించిన కోడి గుడ్డు/వెజ్ పలావ్‌తో కోడి గుడ్డు కూర, చిక్కీ
- మంగళవారం: పులిహోర, టమాట/దొండకాయ చెట్నీ, ఉడికించిన కోడిగుడ్డు, రాగి జావా
- బుధవారం: కూరగాయల అన్నం, ఆలూ కుర్మా, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కీ
- గురువారం: సాంబార్ బాత్, ఉడికించిన కోడి గుడ్డు, పులిహోరాతో టమాట చెట్నీ, రాగి జావా
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కీ
- శనివారం: ఆకురూరల అన్నం, పప్పుచారు, చక్కెర పొంగలి, రాగి జావ.

**పోషకాలతో కూడిన ఆహారం**



కర్నూలు జిల్లాలో 1,436 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలవుతోంది. ఈ పథకం ద్వారా 2,67,828 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ప్రతి రోజు ఒక రకమైన ఆహారం పిల్లలకు పెట్టడంతో పాటు, వారి ఆరోగ్య రీత్యా పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మరింత పౌష్టికాహారం అందించేందుకు మెనూను పక్కగా అమలు చేస్తున్నాం. నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. వంట ఏజెన్సీలకు కానీ, ఆ ఏజెన్సీల నిర్వాహకులకు కానీ ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేవు. వంట ఏజెన్సీలకు వంట పాత్రలు పంపిణీ చేశాం.

– శామ్యూల్ పాల్,
జగనన్న గోరుముద్ద పథకం ఏడీ

## చెప్పాడంటే.. చేస్తాడంతే!

- దస్తగిరి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం



దస్తగిరి దంపతులకు రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చడం, చెప్పిన మాటను నిలబెట్టుకోవడంపైనే వారి విశ్వసనీయత, పేరు ప్రఖ్యాతులు ఆధారపడి ఉంటాయి. ఈ కోవకు చెందిన వారే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మాట ఇస్తే చేస్తారన్న నమ్మకం ప్రజల్లో ఉంది. ఆయన మాటే శాసనం. ఇందుకు కౌతాళం మండలం కామవరానికి చెందిన దస్తగిరి కుటుంబానికి ఆర్థిక సాయం అందించడమే నిదర్శనం. గతేడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో గాజుల దస్తగిరి దంపతులు తమకు ఉన్న ఇద్దరు కుమారులకు పక్షవాతానికి గురవడంతో వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించాలని విన్నవించుకున్నారు. స్పందించిన సీఎం తక్షణమే రూ.2 లక్షలు ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆదేశించారు. అయితే దస్తగిరి కుటుంబం ఇచ్చిన అర్జీలో ఫోన్ నంబర్, చిరునామా లేదు. దీంతో వీరి పేరు ఆర్థిక సాయం జాబితాలో చేర్చలేదు. ఈక్రమంలో వారికి తక్షణ సాయం అధికారులు అందించలేకపోయారు. మరోపక్క సీఎంను కలిసిన ఫొటో ఆధారంగా వివరాలు సేకరించారు. కౌతాళం మండలం కామవరానికి చెందిన వారిగా గుర్తించి మంగళవారం కలెక్టరేట్‌కు పిలిపించి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇద్దరికి కలిపి రూ.2 లక్షలు ఆర్థిక సాయాన్ని కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఉంటామని, వారి మేలును జీవితంలో ఎప్పుడూ మార్చిపోలేమని దస్తగిరి పేర్కొన్నాడు.

# సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి

- పోలీసు అధికారులకు డీఐజీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ విజయరావు

కర్నూలు:సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని సమష్టిగా ముందుకు సాగాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు పోలీసు అధికారులకు సూచించారు.ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి మంగళవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలతో సమీక్ష నిర్వహించారు.ముందుగా డీపీఓలోని సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను, పోలీస్ పరే డ్ మైదానాన్ని తనిఖీ చేశారు. అనంతరం సబ్ డివిజన్ల వారీగా పోలీసు అధికారులతో మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు .మద్యం,డబ్బు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు.లైసెన్స్ ఆయుధా ల డిపాజిట్లు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

- ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లాలో భారీ నేరా లతో పాటు రోడ్డు ప్రమాదాల సంఖ్య బాగా తగ్గించామన్నారు. ఎన్నికలు కూడా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగుతా మన్నారు. జిల్లాలో ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా టెలికాన్ఫరెన్స్‌లో వెంటనే అప్రమత్తం చేస్తున్నామని డీఐజీ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబా బు,డీఎస్పీలు విజయశేఖర్, శివనారాయణస్వామి, సీతారామయ్య, ట్రైనీ డీఎస్పీ భావన, జిల్లాలోని సీఐలు పాల్గొన్నారు.

### వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్ లిస్టు

కర్నూలు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలకు చెందిన 30 కేటగిరిలలో ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును ప్రభుత్వ వెబ్‌సైట్ https://kurnool.ap.gov.in, https://nandyal.ap.gov.in,https://kurnoolmedicallege. ac.in లలో అప్‌లోడ్ చేసినట్లు కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ మంగళవారం తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో ఆడియో విజువల్ టెక్నిషియన్స్, స్టోర్ అటెండర్, ఆఫీస్ సబార్డినేట్, జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. అభ్యర్థుల మెరిట్ లిస్ట్ వివరాలను సరి చూసుకోవాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే ఈనెల 23వ తేదీ సాయంత్రం లోపు కర్నూలు వైద్య కళాశాల కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అర్జీ సమర్పించాలన్నారు.

- శ్రీగిరిలో నేడు మహారుద్ర శతచండీ వేదస్వాహాకార పూర్వక మహాకుంభాభిషేకం
- శివాజీగోపురానికి సువర్ణ కలశ ప్రతిష్టాపన, కుంభాభిషేకం
- ప్రధానాలయాలు, గోపురాలతో పాటు పరివార ఆలయాలకు
- మహాకుంభాభిషేకంలో పాల్గొననున్న పలువురు పీఠాధిపతులు

# చూసిన కనులదే భాగ్యం



మహాకుంభాభిషేకానికి ముస్తాబైన శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల క్షేత్రం మహాత్కార్యానికి సిద్ధమైంది. మహారుద్ర శతచండీ వేద స్వాహాకార పూర్వక మహాకుంభాభిషేక ముహూర్తం సమీపించింది. మరి కొద్ది గంటల్లో ఈ అద్భుత కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు వివిధ మఠాల పీఠాధిపతులు శ్రీగిరికి చేరుకున్నారు. బుధవారం 8.45 గంటల నుంచి మహాక్రతువుకు శ్రీకారం చుట్టనున్నారు. అనంత దైవశక్తిని మరలా ప్రతిష్ఠించుకునే మహత్తర ఘట్టమిది. ఆలయ శక్తిని మరింత పెంపొందించుకునే మహిమాన్విత క్రియ. పంచభూతాత్మకమైన కుంభంలో పంచముఖుడైన శంభువుని నిలిపి సకల కళలను, తత్త్వాలను నింపి దానికి నిరంతర జప, ధ్యాన, హోమాదులను జరిపి ఆలయ గోపుర విమాన శిఖరంపై అభిషేకించే గొప్ప కార్యక్రమం. ఆలయ విమానానికి, గోపురానికి, గర్భగుడిలోని విగ్రహానికి, ప్రాంగణంలోని ఇతర విగ్రహాలకు కుంభాభిషేకం జరుపుతారు. ఈ కుంభాభిషేకంతో ఆ విగ్రహంలోకి అణువణువూ దైవశక్తి ప్రవహించి మరింత తేజోమయమవుతుంది. భక్తుల కోర్కెలు తీర్చే, కల్పవృక్షంగా నిలిచే ఆలయానికి జరిపే కుంభాభిషేకం చూచిన వారిదే అదృష్టంగా భావిస్తారు.

**విస్తృత ఏర్పాట్లు**

శ్రీగిరిలో బుధవారం జరుగనున్న మహాకుంభాభిషేకానికి సంబంధించి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉభయ దేవాలయాల్లోని అన్ని గోపురాలతో పాటు, ఉపాలయాలలోని ఆలయాల గోపురాలకు, క్షేత్ర పరిధిలోని ఉపాలయాల గోపురాలకు పరంజాలు ఏర్పాటు చేశారు. అలాగే శివాజీ గోపురానికి కలశ ప్రతిష్ఠాపన కోసం లిఫ్టును కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి శాంతిహోమం, పౌష్టికహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు జరిపిస్తారు. 8.45 గంటలకు పునరుద్ధరించిన ఆలయాలలో యంత్ర ప్రతిష్ఠలు, శివలింగ–నందీశ్వరుల ప్రతిష్ఠలు, శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక సంబంధిత పూజాదికాలు జరిపిస్తారు. అలాగే 9.45 గంటలకు ఉభయ దేవాలయాల గర్భాలయ విమానాలకు, గోపురాలకు, మూలమూర్తులకు, ఇతర దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం జరిపిస్తారు.

**శ్రీగిరికి చేరుకున్న పీఠాధిపతులు**

శ్రీశైలంలో నిర్వహించే మహాకుంభాభిషేక క్రతువుల్లో పలువురు పీఠాధిపతులు పాల్గొననున్నారు. ఇప్పటికే కంచి కామ కోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ మహాస్వామి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి, కాశీ పీఠాధిపతి డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి శ్రీశైలం చేరుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతులు మల్లికార్జున స్వామివారికి అభిషేకాన్ని జరిపించుకున్నారు.

# యువతులకు పెద్దన్నగా జగన్

- జిల్లాలోని 494 జంటలకు రూ.4.03 కోట్ల విడుదల
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- కలెక్టర్ సృజనతో కలిసి లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేత



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): పేదింటి ఆడ బిడ్డలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దన్నగా ఉంటూ వారి వివాహాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించిన వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల లబ్ధిదారులకు బటన్ నొక్కి ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్యతో జెడ్పీ చైర్మన్ తదితరులు వీక్షించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో పేదల కష్టాలను చూసి అధికారంలోకి వచ్చాక తొలగించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈక్రమంలో ఆడపిల్లల పెళ్లిల్లు తల్లిదండ్రులకు భారం కాకుండా వైఎస్ఆర్ కల్యాణమస్తు, తోఫా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పదో తరగతి పాసైన వారికే కల్యాణమస్తు, తోఫా పథకాలను వర్తింపజేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బాలబాలికల అక్షరాభ్యాసం పెరుగుతుందన్నారు. 18 ఏళ్లు దాటిన వారికే కల్యాణమస్తు, తోఫాలను వర్తింజేస్తుండడంతో బాల్య వివాహాలు తగ్గుముఖం పడతాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ నుంచి డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద మొత్తం 494 జంటలకు రూ.4.03 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులైన జంటలకు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సలీమ్‌బాషా, ఏపీడీ శ్రీధర్, సాంఘిక సంక్షేమ అధికారి రంగలక్ష్మీదేవి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్, మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ ఏ.సు నీల్‌ఖన్నా పాల్గొన్నారు.

**సొంత అన్నలా...**

మాది నిరుపేద కుటుంబం. మా నాన్నకు ముగ్గురు ఆడపిల్లలం. మా అక్కల వివాహాలకు మా నాన్న అప్పు చేయాల్సి వచ్చింది. నా పెళ్లికి జగనన్న సొంత అన్నలా ఆర్థికసాయం చేశారు. ఈ రోజు మా అమ్మ ఖాతాలో రూ.లక్ష జమ చేశారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– చంద్రకళ,ఉయ్యాలవాడ,ఓర్వకల్లు మండలం

**జగనన్న మేలు మరువలేం**

మా అమ్మానాన్న బేల్దారు పనికి వెళ్తారు. వచ్చే అరకొర ఆదాయంతోనే ఇంటి అద్దె, కుటంబాన్ని పోషిస్తున్నారు. నా పెళ్లి కోసం బయట అప్పు చేయాల్సి వచ్చింది. వైఎస్ఆర్ కల్యాణమస్తులో రూ.50 వేల ఆర్థిక అందింది. నేను జగనన్న విద్యా, వసతి దీవెనల ద్వారా బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేశాను. ప్రభుత్వ మేలును మరచిపోలేను.

– టి.మౌనిక,జొహరాపురం, కర్నూలు మండలం

**సాయాన్ని గుర్తుంచుకుంటాం**

మా నాన్న ఎస్ఎండీ అన్సారీ ఆటో డ్రైవర్. మా అమ్మ ఇళ్లలో పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. బయట వాళ్ల వద్ద అప్పు చేసి నా పెళ్లి చేశారు. ఈ రోజు జగనన్న వైఎస్ఆర్ తోఫా ద్వారా ఆర్థిక సాయం అందించారు. జగనన్న చేసిన మేలును మా కుటుంబం మరవదు.

– ఎస్ఎండీ యాస్మిన్, ఎన్ఆర్‌పేట, కర్నూలు

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న బెల్లం మహేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏర్పాటు చేశారు. ఇంతవరకు రైతుల అభ్యున్నతికి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి వివరించారు. కర్నూలు రూరల్ మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలని, ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం వల్ల పంటలు దెబ్బ తిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించే విషయాన్ని వ్యవసాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాన్ని కరువు ప్రాంతాలుగా ప్రకటించేందుకు మరోసారి ప్రతిపాదనలు పంపాలన్నారు. గొర్రెల పెంపకానికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ రుణాలను సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని పశుసంవర్థక శాఖ అధికారులను కోరారు. గొర్రెల పెంపకానికి అవసరమైన రుణాలు ఇచ్చే విధంగా బ్యాంకులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. రైతులకు వ్యక్తిగత పరికరాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆర్‌బీకేల్లో తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ సీహెచ్ శిరోమణి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, మత్స్యశాఖ డీడీ శ్యామల, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రామచంద్రయ్య, వ్యవసాయ శాఖ ఏడీఏలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న సెబ్ సూపరింటెండెంట్

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని మంగళవారం సాయంత్రం వెంకటగిరి గ్రామ రోడ్డులో జిల్లా సెబ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ సమక్షంలో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు సెబ్ సర్కిల్ పరిధిలోని 24 కేసుల్లో పట్టుబడిన రూ.3.88 లక్షల విలువైన 844 లీటర్ల కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. సెబ్ సీఐ భార్గవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. మంగళవారం పాణ్యం వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో పీఎం కిసాన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించిన ఈ కేవైసీ,ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ లింక్ ఉండే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బుధవారం చివరి రోజు కావడంతో పెండింగ్‌లో ఉన్నవారందరికీ తెలియజేయాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలకు రైతుల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, ఏఓ జయప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి కొలనుభారతిలో భీష్మ ఏకాదశి వేడుకలు

కొత్తపల్లి: ఈనెల 22, 23వ తేదీల్లో కొలనుభారతి దేవి ఆలయంలో 65 భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కాకనూరు శ్రీ శారదాపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి తెలిపారు. మంగళవారం ఆయన కొలనుభారతి దేవి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లకు స్థలపరిశీలన చేశారు. ముందుగా అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు చేశారు. తర్వాత సప్తశివాలయాలు, ఆలయ పరిసర ప్రాంతాలలో ఏఏ ఏర్పాట్లు చేయాల అని పరిశీలించారు. ఈఓ మోహన్, ఆలయ సిబ్బందికి భీష్మ ఏకాదశిని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఏర్పాట్లకు ఆలయ సిబ్బంది సహకరించాలని కోరారు.

# ఉన్నత విద్యోగాలే లక్ష్యం కావాలి

- వెనుకబడిన ప్రాంతంలో జాతీయ స్థాయి విద్యాసంస్థ ఏర్పాటు అభినందనీయం
- ఈ ప్రాంత ప్రజల తరపున మోదీకి కృతజ్ఞతలు
- రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్
- కర్నూలు ట్రిపుల్‌ఐటీ డీఎంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

కర్నూలు కల్చరల్: ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగా చదవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్‌బాషా విద్యార్థులకు సూచించారు. జగన్నాథ గట్టు మీద ఉన్న ట్రిపుల్ ఐటీ డీఎమ్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం జమ్మూకశ్మీర్ నుంచి వర్చువల్‌గా జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు నుంచి అంజాద్‌బాషా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ డీఎంను వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యా సంస్థ భవనాన్ని కొండరాళ్ల మధ్య నిర్మించిన ఇంజినీర్ల కృషి అమోఘమన్నారు. ఇక్కడ చదువుకున్న ప్రతిఒక్కరూ ఉన్నత ఉద్యోగాలు సాధించి దేశంలోనే కర్నూలును అగ్రగామిగా నిలపాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు తీసుకురావడంతోపాటు అమ్మ ఒడి, నాడు–నేడు, విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ కర్నూలు లాంటి కరువు జిల్లాలో ఇలాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలన్నారు. ఈ సంస్థకు సంబంధించి పార్లమెంట్‌లో పలు ప్రశ్నలు లేవనెత్తానన్నారు. విద్యా సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ హెచ్.ఎ.రంగనాథ్ మాట్లాడుతూ త్వరలోనే ఈ సంస్థను అగ్రగామిగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తామన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ డీవీఎల్ఎన్ సోమయాజులు మాట్లాడుతూ జగన్నాథ గట్టుపై నూతనంగా 151.15 ఎకరాల్లో 5 లక్షల స్క్వేర్ ఫీట్‌లలో రూ.296 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ట్రిపుల్‌ఐటీ డీఎమ్‌లో 907 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. 40 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ, 10 మంది అనుబంధ ఫ్యాకల్టీ, 19 మంది రెగ్యులర్ నాన్ టీచింగ్ ఉద్యోగులు ఉన్నారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ క్యాంపస్‌ను దేశానికి అంకితం చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గురుమూర్తి, డీఆర్ఓ మధుసూదన్ రావు, సీపీడబ్ల్యూ ఇంజినీర్, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

## కళాశాలలో టీడీపీ సమావేశాలా?

- ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తాం
- నవ్యాంధ్ర విద్యార్థి, యువజన జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న అయ్యస్వామి

కర్నూలు(అర్బన్): విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించాల్సిన కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో తెలుగుదేశం పార్టీ సమావేశాలు నిర్వహించిన యాజమాన్యంపై ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు నవ్యాంధ్ర విద్యార్థి, యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అయ్యస్వామి, డీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శరత్ చెప్పారు. మంగళవారం బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పేరుతో విద్యార్థులతో కళాశాలలో సమావేశాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. కేవీ సుబ్బారెడ్డికి రాజకీయాలపై మక్కువ ఉంటే ప్రత్యక్షంగా బయట చూసుకోవాలని, కళాశాలలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల మధ్య చిచ్చు పెడుతూ వారిని చదువులకు దూరం చేయొద్దని హితవు పలికారు. సమావేశంలో జేఏసీ నాయకులు హర్షవర్ధన్, హరికృష్ణ, వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- నోడల్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల విధుల నిర్వహణకు నోడల్ అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై నోడల్ అధికారులు, ఆర్వోలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం ఉందన్న అలసత్వం వీడి కేటాయించిన విధుల నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి పనులు బాగానే జరుగుతున్నాయన్నారు. కొన్ని శాఖల సిబ్బంది వివరాల నమోదు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మెటీరియల్ పంపిణీలో పక్కగా రికార్డులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గాల వారీగా అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకొని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం సెక్టార్ అధికారులకు, శుక్రవారం ఎంసీసీ బృందాలకు శిక్షణ ఇవ్వాలని, ఇందులో ఎంపీడీఓలు కూడా ఉండాలని సూచించారు. ఆర్ఓలు, ఏఆర్ఓలు, అసిస్టెంట్ మాస్టర్ ట్రైనర్లు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లకు కూడా శిక్షణ తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

**స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించండి**

జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం స్ట్రాంగ్ రూమ్‌లకు అనువైన భవనాలను గుర్తించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేయబోతున్న స్ట్రాంగ్ రూమ్ కోసం ఎంపిక చేసిన భవనాలను జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట కల్లూరు తహసీల్దారు మునివేలు ఉన్నారు.

## మూడు ట్రాక్టర్లు స్వాధీనం



ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్ : క్రిష్ణగిరి మండలంలోని ఎర్రగుడి, ఎర్రబాడు గ్రామాల మధ్య ఉన్న హంద్రీనది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేల చొప్పున జరిమాన విధించినట్లు కోడుమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ రామాంజినేయులు మంగళవారం తెలిపారు. ఎవ్వరైనా అక్రమంగా హంద్రీ నుంచి ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. దాడుల్లో సీఐతో పాటు సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, ఆప్రోజ్‌బాషా, శంకర్ నాయక్, విరుపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

## కుంభాభిషేకంలో విధులు నిర్వహించడం అదృష్టం

- రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ



సమీక్ష నిర్వహిస్తున్న దేవదాయశాఖ కమిషనర్

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం జరిపే కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనే అవకాశం సిబ్బందికి రావడం ఎంతో అదృష్టంగా భావించాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం శ్రీశైలంలోని సీసీ కంట్రోల్ రూంలో సమీక్షా సమావేశ మందిరంలో మహాకుంభాభిషేక ఏర్పాట్లను సమీక్షించారు. ముందుగా దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్ల గురించి వివరించారు. వైదిక కమిటీ సభ్యులు వైదిక కార్యక్రమాల గురించి వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది అందరూ కూడా వారివారికి అప్పగించిన ప్రత్యేక విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మహాకుంభాభిషేకంలో పీఠాధిపతులు, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నందున ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో దేవదాయ అర్చక అకాడమీ డాక్టర్ వేదాంతం చక్రవర్తి, డీసీ హెచ్.జి వెంకటేశ్, ఈఈ వి.రామకృష్ణ, ప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో న్యూరో ఇంటెన్సివ్ కేర్



న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజనా

కర్నూలు(టౌన్): రాష్ట్రంలోనే మొట్టమొదటి న్యూరో ఇంటెన్సివ్ కేర్(స్ట్రోక్) యూనిట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. మంగళవారం స్థానిక కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మాత శిశు కేంద్రంలోని రెండో ఫ్లోర్‌లో న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (స్ట్రోక్ పక్షపాతం)ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12 పడకలతో నిర్మించిన ఐసీయూ 24 గంటల పాటు సేవలందిస్తుందన్నారు. యూనిట్ ఏర్పాటుతో ఆసుపత్రిలోని ఏఎంసీ విభాగంపై భారం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం స్ట్రోక్ బాధితుల్లో పరిస్థితి తీవ్రంగా ఉన్న రోగులకు బీపీ ఎక్కువగా ఉండటం వల్ల మెదడులో రక్తనాళాలు చిట్లి బ్రెయిన్‌లో ట్యూమర్స్, మెటబాలిన్ సమస్యలు వస్తాయన్నారు. ఫిట్స్ కేసులు ఎక్కువగా వస్తుండటంతో న్యూరో ఇంటెన్సివ్ ఐసీయూను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెంటెండ్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు, కాశీ పీఠాధిపతులు



మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు, కాశీ పీఠాధిపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి, కాశీ పీఠాధిపతి డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం రాత్రి ఆలయం వద్దకు విచ్చేసిన పీఠాధిపతులకు ఆలయ అధికారులు, ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతులు మల్లికార్జున స్వామివారికి అభిషేకం, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. ఆశీర్వచన మండపంలో పీఠాధిపతుల గౌరవార్థం వస్త్ర, ప్రసాదాలను అందించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు నగలు, రూ.50 వేల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్‌టీం

పత్తికొండ రూరల్: పత్తికొండ–ఆదోని రోడ్డులోని సవారమ్మ ఆలయం సమీపంలోని ఓ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అనసూయమ్మ తన ఇంటికి తాళం వేసి సోమవారం మద్దికెరలోని బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటికి రాగా తాళం పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగిన విషయాన్ని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందజేసింది. వారు అక్కడికి చేరుకుని సమీపంలో ఉన్న సీసీ పుటేజీని పరిశీలించగా ఓ యువకుడు కాంపౌండ్ గేటు దూకి లోపల ఇనుప తలుపులకు ఉన్న తాళం పెకిలించిన దృశ్యం, కొంత సేపటికే ఆ యువకుడు బయటకు వెళ్తున్న దృశ్యం గుర్తించారు. కర్నూలు నుంచి క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కాగా ఇంట్లోని ప్రత్యేక లాకర్‌లో ఉంచిన సుమారు 12 తులాల బంగారు కమ్మలు, ఇతర ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

## ఇక ప్రతిరోజూ అంకాలజీ ఓపీ సేవలు

కర్నూలు(టౌన్): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో అంకాలజీ పేషెంట్లకు ప్రతి రోజూ ఓపీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి సమావేశ హాలులో వివిధ విభాగాల హెచ్ఓడిలు, ఆరోగ్యశ్రీ, ఈ- హాస్పిటల్స్‌పై సమీక్ష నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో తిరస్కరించిన కేసులపై ఆరా తీసి తిరిగి దరఖాస్తు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి, ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రాక్టికల్ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 5 నుంచి ఒకేషన్ పరీక్షలు 25 కేంద్రాల్లో, 11వ తేదీ నుంచి జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు 92 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. చివరి రోజున ఉదయం 315 మందికి గాను 314 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 526 మందికి గానూ 511 మంది పరీక్షలు రాయగా 15 మంది గైర్హాజరయ్యారు.

## భక్తులతో కిటకిటలాడిన మూలపెద్దమ్మ ఆలయం

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్ద అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



మూల పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

## విజేతలు చౌటపల్లె, పులకుర్తి వృషభాలు



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పేరెడ్డి ప్రభాకర్ రెడ్డి

మిడుతూరు: శ్రీ బరక సంజీవరాయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి (4 పళ్ల విభాగం) ఎడ్ల పోటీల్లో చౌటపల్లె గ్రామానికి చెందిన హనుమంతు, పులకుర్తి గ్రామానికి చెందిన రామచంద్ర ఎద్దు (కంబైన్డ్ జత) ప్రథమ స్థానంలో నిలిచి రూ 40 వేలు గెలుచుకున్నాయి. మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన రోటీ మేడం వృషభాలు రెండో స్థానంలో రూ. 30 వేలు, నంద్యాల జిల్లా బిల్లాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్ ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ. 20 వేలు కైవసం చేసుకున్నాయి. ఎస్ కొత్తూరు గ్రామానికి చెందిన బీఎస్ ఎస్ రెడ్డి, పోలూరు గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి (కంబైన్డ్ జత) నాల్గవ స్థానంలో రూ 10వేలు, కొత్తూరు గ్రామానికి చెందిన బీరమ్ బుల్స్, బీజవరం గ్రామానికి చెందిన అంజనేయులు (కంబైన్డ్ జత) ఐదో స్థానంలో రూ.6 వేలు, ఏ. కోడూరు గ్రామానికి చెందిన తిమ్మప్ప నాయుడు వృషభాలు ఆరో స్థానంలో నిలిచి రూ 5 వేలు అందుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, డాక్టర్ పేరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా శయ్యాధివాసం



మహా కుంభాభిషే క్రతువులో శయ్యాధివాసం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహారుద్ర శతచండీ వేదస్వాహాకార పూర్వక మహాకుంభాభిషేక క్రతువులు వైభవంగా కొనసాగుతున్నాయి. మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఐదవరోజు మంగళవారం ఆలయంలో శాస్త్రోక్తంగా ఆయా పూజాదికాలను నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గోపూజ, మండపపూజలు, జపములు, వేదపారాయణలు, గణపతి, రుద్ర, చండీ పారాయణలు, హోమములు, వేదహవనములు జరిపారు. అలాగే సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు శయ్యాధివాసం నిర్వహించారు. శయ్యాధివాసం పూజా కార్యక్రమంలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతులు డా.చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి, కాశీ మహాపీఠం పీఠాధిపతి జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు, హారతి ఇచ్చారు. అనంతరం దేవతాహవనములు, వేదహవనములు, వేదస్వస్తి, నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిపించారు. ఆలయ అర్చకులతో పాటు ఇతర దేవాలయాలకు చెందిన పలువురు అర్చకులు శ్రీశైలం చేరుకుని ఆయా పూజా కార్యక్రమాలను జరిపిస్తున్నారు.